క్లుప్తంగా

పచ్చ తోరణం అనుకుంటే పొరపాటే...


ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న ముళ్లతీగలు

శ్రీరంగరాజపురం: ఈ చిత్రంలో ఉన్నది పచ్చ తోరణం అని అనుకుంటే పొరబడినట్లే.. ఎందుకంటే ఇది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడుకున్న విద్యుత్ స్తంభం. మండలంలోని వి.వి.పురం పంచాయతీలోని ఆరిమానిగంగమ్మగుడి, ధర్మరాజులు గుడి వద్ద ఈ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. అమ్మవారి దర్శనానికి నిత్యం భక్తులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన భక్తులు ధర్మరాజుల గుడి వద్ద వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. విద్యుత్ తీగలకు పచ్చని తోరణంలా అల్లుకున్న తీగలతో భక్తులకు ప్రమాదం తప్పేలా లేదు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తర పూజలు


సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. మాధురీ దిలీప్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓం శక్తి పూజలు


పూజలు చేస్తున్న మహిళా భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ కోణింగిపల్లెలో ఆదివారం ఓం శక్తి భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అంబలి పోసి పూజలు చేశారు. అనంతరం భక్తులు ఇరుముడులు కట్టుకున్నారు. ప్రసాదాలను అమ్మవారికి నివేదించి భక్తి ప్రపత్తులతో కొలిచారు. ఓం శక్తి పరాశక్తి అంటూ మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి


డాక్టర్ సుబ్రమణ్యం

పెనుమూరు(కార్వేటినగరం): పశువుల సంరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టే ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20 నుంచి 31వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల వద్ద పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం గుంటిపల్లి, పెరుమాళ కండ్రిగ ఆర్‌ఎస్‌కే నుంచి ప్రారంభం కానుందని చెప్పారు. ఈ శిబిరాల్లో ముఖ్యంగా పశు వైద్య చికిత్స, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందులు పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీపీఐ నేతల నిరసన

చిత్తూరు కార్పొరేషన్: కేంద్రమంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడారు. ఇటీవల పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానపరిచిన అమిత్ షా రాష్ట్రానికి రావడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని రచించి దశ, దిశ నిర్దేశించిన అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడడం సరికాదన్నారు. ఈ మేరకు వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు చిత్తూరులో నిరసన వ్యక్తం చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

సాహితీ పురస్కారానికి రచనలు ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కార పోటీకి రచనలు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షురాలు రోజాప్రియ తెలిపారు. కథల సంపుటి, నవలలు, చందో పద్య కవిత్వం, వచన కవిత్వంను 2024లో ముద్రితమైన పుస్తకాలను మాత్రమే పంపాలన్నారు. ఉత్తమ రచనకు రూ.10 వేల నగదు బహుమతి ఉంటుందన్నారు. శ్రీరామనవమి రోజు ఈ సాహితీ పురస్కారం అందిస్తామన్నారు. రచయితలు, కవులు వారి రచనలను మూడు పుస్తకాలుగా కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు అనే చిరునామాకు పంపాలని ఆమె పేర్కొన్నారు.

ప్రజాధికారం నిర్వీర్యం


తెరణి గ్రామంలో సర్పంచ్ ప్రమేయం లేకుండా వేస్తున్న రోడ్డు

గ్రామాల్లో నిత్యం ఏదో ఒక సమస్య ప్రజలను వేధిస్తుంటుంది. ఆ సమస్య పరిష్కారానికి ప్రజలు నేతల చుట్టూ తిరుగుతారు. పెద్ద సమస్య అయితే.. ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి నేతల వద్దకు తమ గోడు వెళ్లబోసుకుంటారు. కానీ చిన్నచిన్న సమస్యలు తాము ఎన్నుకున్న సర్పంచికి వివరించి.. పరిష్కారమయ్యేలా చూసుకుంటారు. గ్రామాల్లో చాలా పనులు పంచాయతీ, సర్పంచి చేయాల్సినవే ఉంటాయి. వీధి దీపాల దగ్గర్నుంచి.. పారిశుధ్య నిర్వహణ వరకు, గ్రామ పంచాయతీ అభివృద్ధి సర్పంచే చూసుకుంటారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపు కూడా సర్పంచులే చూసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ నేడు మారింది. గ్రామస్వరాజ్యానికి మూలస్తంభం లాంటి పంచాయతీ వ్యవస్థ పతనానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

– నగరి

- సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే పనులు
- పేరుకే సర్పంచ్.. శాసించేది కూటమి నేతలు

గత పంచాయతీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని 97 పంచాయతీలకు గాను 92 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. టీడీపీ పట్టుకోల్పోవడంతో అత్యధిక స్థానాలు వైఎస్సార్ సీపీ అండతో నిలబడ్డవారే కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. టీడీపీ అనుయాయులు అధిక సంఖ్యలో సర్పంచ్‌లుగా లేకపోవడంతో వారి అధికారాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి నడుం బిగించింది. సర్పంచుల్ని ఎందుకూ కొరగానివాళ్లుగా మార్చేసింది. పంచాయతీలకు సర్వాధికారాలు కల్పించిన 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి తూట్లు పొడిచింది. సర్పంచుల్ని ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన అధికారాల్ని ఇవ్వకపోగా... వారికున్న కొద్దిపాటి అధికారాలను కూటమి ప్రభుత్వం లాగేసుకుంది. సర్పంచ్‌లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అణగదొక్కేస్తోంది తాము అధికారంలోకి వస్తే వారికి సర్వాధికారాలు కల్పిస్తామన్న టీడీపీ నేతలు అధికారం వచ్చాక తూచ్ అనేశారు. గ్రామాల్లో నిర్వహించే పల్లెపండుగ పనులకు, గోకులం షెడ్ల లబ్ధిదారులను గుర్తించడానికి సర్పంచులకు ఎలాంటి అజమాయిషీ లేకుండా చేశారు.

పల్లెపండుగలో పచ్చ పెత్తనం

పల్లెపండుగ కార్యక్రమం కింద నగరి మండలంలో 73 ప్రాంతాల్లో 7041 మీటర్ల మేర రోడ్లు వేయడానికి రూ.2.84 కోట్లు అంచనా వ్యయం నిర్ణయించారు. నిండ్ర మండలంలో 77 ప్రాంతాల్లో 7881 మీటర్ల మేర రోడ్లు వేయడానికి 3.15 కోట్లు, విజయపురం మండలంలో 71 ప్రాంతాల్లో 5680 మీటర్ల మేర రోడ్లు వేయడానికి 5.68 కోట్లు, పుత్తూరు మండలంలో 52 ప్రాంతాల్లో 2650 మీటర్ల మేర రోడ్లు వేయడానికి రూ.1.06 కోట్లు, వడమాలపేట మండలం తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల అంచనా వ్యయం నిర్ణయించారు. నామినేటెడ్ పద్ధతిలో చేపట్టాల్సిన ఈ పనులు సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే చేపట్టారు. ఇలా విద్యుత్ దీపాల ఏర్పాటు, గోకులం షెడ్లకు లబ్ధిదారుల గుర్తింపు అంటూ సర్పంచ్‌ల ప్రమేయం ఉండడం లేదు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయి. పల్లెపండుగ పనులు అధికార పార్టీ నేతల జేబులు నింపుతోంది.

అధికార బలంతో అవినీతి



మా పంచాయతీలో పల్లెపండుగ కింద నాలుగు ప్రాంతాల్లో రోడ్లు మంజూరయ్యాయి. 505 మీటర్లు రోడ్డు వేయడానికి రూ.20.70 లక్షలు మంజూరయ్యాయి. అలాగే గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అధికార బలంతో ఈ పనులు టీడీపీ నేతలే చేపడుతున్నారు. అధికారం నిర్వీర్యమైపోతున్నా గ్రామంలో జరిగే పనులు అడ్డుకోకూడదనే ఉద్దేశంతో రెజల్యూషన్ ఇవ్వాల్సి వచ్చింది.

– ప్రకాష్, సర్పంచ్, ముడిపల్లి

సర్పంచుల విధులకు ఆటంకం



73వ రాజ్యాంగ సవరణ మేరకు పంచాయతీలకు సర్వాధికారాలు ఉండాలి. అయితే ఆ అధికారాలు ప్రస్తుతం లేవు. గ్రామ సర్పంచ్‌లుగా ఉన్న గ్రామాల్లో జరిగే పనులు సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా జరుగుతోంది. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కుకు తూట్లు పొడవడమే. సర్పంచ్‌ల విధులకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– రవికుమార్, సర్పంచ్, బుగ్గఅగ్రహారం

సర్పంచులకు విలువ ఎక్కడ?



కూటమి ప్రభుత్వ ఏర్పడినప్పటి నుంచి సర్పంచులకు విలువలు లేవు. అధికారులను సైతం రాజకీయ నాయకులు భయపెడుతున్నారు. మా గ్రామానికి సిమెంట్ రోడ్డు మంజూరైతే అది వేసేంత వరకు నాకు తెలియలేదంటే కూటమి ప్రభుత్వం సర్పంచులను ఎంత చిన్న చూపు చూస్తుందో అర్థమవుతోంది. దీనిపై కలెక్టర్ స్పందించి, సర్పంచులకు హక్కు కల్పించాలి.

– శాంతి, సర్పంచ్, మల్లారెడ్డికండ్రిగ

నేడు పశు వైద్య శిబిరం

విజయపురం: మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పశువైద్యాధికారి శివమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరాల్లో ముఖ్యంగా పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. సోమవారం విజయపురం, కలియంబాకంలో శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంతా... ఆయన కనుసన్నల్లోనే..


మహారాజపురంలో గ్రావెల్ తరలింపు

విజయపురం: తాము అధికారంలోకి వస్తే పిడికెడు మట్టి కూడా తమిళనాడుకు వెళ్లడానికి వీలులేదు అన్న నాయకుడు ఇప్పుడు గ్రావెల్ తరలింపులో ముందున్నాడు. ఒకప్పుడు గ్రావెల్‌పై దుమ్మెత్తిపోసిన కూటమి నాయకులు ఈ రోజు అభివృద్ధి ముసుగులో తమిళనాడుకు మట్టి తరలించి జేబులు నింపుకొంటున్నారు. ఇలా రోజుకి వందల సంఖ్యలో గ్రావెల్ తరలించి అవినీతికి పాల్పడుతున్నారని మహారాజపురం ప్రజలు మండిపడుతున్నారు. ఒక ట్రిప్పుకు రూ.వెయ్యి చొప్పున రోజుకి రూ.లక్ష నుంచి మూడు లక్షల వరకు వసూళ్లకు పాల్పడి, తమిళనాడులో రోడ్డు విస్తారణాభివృద్ధి పేరుతో గ్రావెల్ తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదంతా కూటమి నాయకుడి కనుసన్నల్లోనే సాగుతుండడంతో అధికారులు సైతం అక్కడికి వెళ్లడానికి భయపడుతున్నారు.

పాలన అస్తవ్యస్తం


ఇన్‌చార్జి పాలనలో వెంగళరాజుకుప్ప గ్రామ సచివాలయం

గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. పాలసముద్రం మండలంలో అసలే గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ఆపై 13 పంచాయతీలకు ముగ్గురు గ్రామ కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ కార్యదర్శుల్లోనే కొందరిని ఖాళీగా ఉన్న గ్రామాలకు ఇన్‌చార్జీలుగా నియమించారు. అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారికి పని భారం పెరిగిపోయింది. – పాలసముద్రం

- పల్లెల్లో పడకేసిన పాలన
- 13 పంచాయతీలకు ముగ్గురే కార్యదర్శులు
- పెరిగిన పనిభారం

కొన్ని పంచాయతీల్లో సిబ్బంది పోస్టులు కూడా భర్తీ కాకపోవడంతో పనులు పడకేస్తున్నాయి. కనీసం ఫైల్ అందించేందుకు కూడా సిబ్బంది కొరత ఉంది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి పన్నుల వసూళ్ల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యదర్శులు హాజరై పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారు.

ఖాళీలను భర్తీ చేయకనే..

పంచాయతీ కార్యదర్శుల ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అసలే మండల విస్తరణాధికారి పోస్టు ఖాళీగానే ఉంది. మండలంలో సత్యనారాయణ వనదుర్గాపురం పంచాయతీ కార్యదర్శి. ఆయనకు ఇన్‌చార్జిగా పాలసముద్రం, శ్రీకావేరిరాజుపురం, ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ, క్రిష్ణజమ్మపురం పంచాయతీలు ఉన్నాయి బాలక్రిష్టాపురం పంచాయతీ కార్యదర్శిగా, ఇన్‌చార్జి మండల విస్తరణాధికారిగా రమేష్ ఉన్నారు. ఈయన సైతం ఆముదాల, వెంగళరాజుకుప్పం, నరసింహపురం, కోదండరామపురం పంచాయతీలకు కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సింహరాజుపురం పంచాయతీ కార్యదర్శి హరికి గంగమాంబపురం, తిరుమలరాజుపురం పంచాయతీలకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇలా అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవడంతో పాలన కుంటు పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి కారణంగా అభివృద్ధి పనులు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే థామస్ మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరతను తీర్చాలి. మండలంలోని కార్యదర్శులకు పని భారంగానే మారింది. కార్యదర్శులు ఏ గ్రామానికీ న్యాయం చేయలేక సతమతమవుతున్నారు.

– అనురేఖ, ఆముదాల, సర్పంచ్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరల్లో ఖాళీగా ఉన్న పంచాయతీలకు కార్యదర్శులను నియమిస్తాం. అంతవరకు పంచాయతీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకురండి. వెంటనే వాటిని పరిష్కరిస్తాం.

– కృష్ణమహేష్ రెడ్డి, ఎంపీడీఓ, పాలసముద్రం

కార్యదర్శులను నియమించాల్సి ఉంది



మండలంలో గ్రామ కార్యదర్శుల కొరత ఉన్నమాట వాస్తవం. ఆ ఖాళీలలో కార్యదర్శులను నియమించాల్సి ఉంది. అయితే ఆ నియామకాలపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కావాలి. కనీసం బదిలీలపై అయినా కార్యదర్శులు రావాలి. రెండు, మూడు నెలల్లో ఈ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది.

– సుధాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

జనహిత సేవలు వినియోగించుకోండి


పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు పంపిణీ

కార్వేటినగరం: స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి, డైట్ అధ్యాపకుడు చెంగల్రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత హెచ్‌ఎం విజయకుమార్ పిళ్లైమాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఇంటికే పరిమితమైనవారికి నగరి, పుత్తూరులోని ట్రెజరీలకు వెళ్లకుండా ఒక్కచోటే లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్న జనహిత సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెంగమ్మ, సుకుమార్ రాజు, ఉపాధ్యాయవాణి సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో 36.4 మి.మీ వర్షపాతం


ఇల్లత్తూరు–ఎస్ఎస్‌కండ్రిగ రోడ్డుపై వర్షపు నీరు

విజయపురం: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 36.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కాలువలు, గుంటలు, పొలాలపై వర్షపు నీరు పొంగిపొర్లింది. ఇల్లత్తూరు–ఎస్ఎస్‌కండ్రిగ రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.


పాతర్కాడులో నెలకొరిగిన వరి పంట

ప్రాణానికి రక్షణ.. హెల్మెట్ ధారణ

- రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం తోనే మరణాలు అధికం

నేటి యువత దుందుడుకు స్వభావం, త్వరగా వెళ్లాలనే అత్యుత్సాహంతో అతివేగంగా ద్విచక్ర వాహనాలను నడుపుతున్నారు. దీనికి తోడు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా ఎన్నో కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోతున్నాయి. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాప్రాయం నుంచి తప్పించుకోవచ్చుని చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్‌కు హెల్మెట్‌ను లింకు చేశారు. కొత్త వాహనం కొనుగోలు చేసిన సమయంలోనే హెల్మెట్ తీసుకోవాలనే షరతు విధించారు. – విజయపురం



రోడ్డుపై వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తికి శరీరంలోని అన్ని అవయవాలకంటే కూడా తలే ముఖ్యం. తలలో భద్రంగా ఉండే మెదడు అన్ని శరీర భాగాలతో పని చేయిస్తుంది. శరీర సమతుల్యతను కాపాడుతుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మెదడుకు దెబ్బ తగిలితే, తగిలిన చోట ఉన్న మెదడు కణాలు(న్యూరాన్లు) నశిస్తాయి. న్యూరాన్లు నశించడంతో అప్పటి వరకూ పని చేస్తున్న అవయవాల పనితీరు దెబ్బతింటుంది. దెబ్బ తీవ్రతను బట్టి కొన్ని అవయవాలు శాశ్వతంగా చచ్చుబడడం, జ్ఞాపకశక్తిని కోల్పోవడం సంభవిస్తుంది. అందుకే టూవీలర్స్‌ను నడిపే ప్రతి వారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరిస్తారు. ఈ హెల్మెట్ వాడకంతో ప్రమాదాలు జరిగినప్పుడు తలకు అయ్యే గాయాల తీవ్రతను తగ్గిస్తుంది. అందుకే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధనలను కఠినతరం చేస్తున్నారు.

హెల్మెట్ లేకపోవడంతోనే...

- వడమాలపేట మండలం ఎస్వీపురం గుట్టకింద అరుంధతివాడకు చెందిన చిరంజీవి(47) టీటీడీ అన్నదానం క్యాంటీన్‌లో పని చేస్తున్నాడు. రోజూ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తూ, రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అయితే తనకు హెల్మెట్ లేకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- మండలంలో జరిగిన ప్రమాదంలో తమిళనాడు పెరంబదూర్‌కు చెందిన కార్తీక్ (22), గౌతమ్ (20)లు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి లారీ కింద పడడంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా, గౌతమ్‌కు హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యాడు.
- నగరి రూరల్ మండలం, తడుకు పేట, ఎస్వీపురం గ్రామానికి చెందిన హరినాయుడు(32) మొలకెత్తిన విత్తనాలు, ఆర్గానిక్ జ్యూస్‌లు ఇంటింటికీ అమ్ముతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిరంజీవి (ఫైల్)


నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

పింఛన్ బాబూ!



ఈమె పేరు తులసమ్మ. వయస్సు 63 సంవత్సరాలు. నగరి నియోజకవర్గం, విజయపురం మండలం, కమ్మకండ్రిగ గ్రామం. గత ప్రభుత్వంలో తన భర్త రాధాకృష్ణకు పింఛన్ వచ్చేంది. అతను ఇటీవల మృతి చెందడంతో ఆమె ఒటరిగా మిగిలిపోయింది. ఉండడానికి కూడా సరైన ఇల్లు లేదు. ఏడాది క్రితం భర్త చనిపోవడంతో పింఛన్ ఆగిపోయింది. తినడానికి తిండి లేక పస్తులతో సహవాసం చేస్తోంది. గత ఏడు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఏ అధికారీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైన జిల్లా అధికారులు తమకు పింఛన్ ఇప్పించాలని కోరింది.

– విజయపురం